# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..






నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 04 | పేజీలు : 8 | సోమవారం | 12 జనవరి 2026 | వెల : 2/-


# భారత్‌పై దాడులకు వేలమంది బాంబర్లు సిద్ధం

## కలకలం రేపుతున్న మసూద్ అజహర్ ఆడియో!




డెస్క్, జనవరి 11, (తొలి వెలుగు) : నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ (జీవవీ) చీఫ్ మసూద్ అజహర్‌దిగా చెబుతున్న ఓ కొత్త ఆడియో రికార్డింగ్ ఆదివారం ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. భారత్‌పై దాడులకు వేలాది మంది ఆత్మాహుతి దళ సభ్యులు సిద్ధంగా ఉన్నారంటూ అందులో చేసిన హెచ్చరికలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆడియో క్లిప్‌లో, వెయ్యి మందికి పైగా ఆత్మాహుతి బాంబర్లు ఏ క్షణంలోనైనా భారత్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగేందుకు సిద్ధంగా ఉన్నారని అజహర్ చెప్పినట్టుగా ఉంది. "వీళ్లు ఒకరు, ఇద్దరు, వంద కాదు.. వెయ్యి మంది కూడా కాదు. అసలు సంఖ్య చెబితే ప్రపంచ మీడియాలో రేపు పెను సంచలనం అవుతుంది" అని అందులో హెచ్చరించాడు. తమ యోధులు ప్రాపంచిక సుఖాల కోసం కాకుండా 'షహాదత్ణ (అమరత్వం) కోసం సిద్ధంగా ఉన్నారని కూడా ఆ వాయిస్ పేర్కొంది. అయితే, ఈ ఆడియో రికార్డింగ్ ఎప్పటిది, దీని ప్రామాణికత ఎంతవరకు నిజమనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిని స్వతంత్రంగా ధృవీకరించాల్సి ఉంది. ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించబడిన మసూద్ అజహర్, పాకిస్థాన్ గడ్డపై నుంచి భారత్‌పై విషం చిమ్ముతూ అనేక ఉగ్రదాడులకు కుట్ర పన్నిన విషయం తెలిసిందే. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై దాడులతో సహా పలు భారీ ఉగ్రవాద ఘటనలకు ఇతడే ప్రధాన సూత్రధారి. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై దాడులతో సహా పలు భారీ ఉగ్రవాద ఘటనలకు ఇతడే ప్రధాన సూత్రధారి. 'ఆపరేషన్ సిందూర్ణలో భారత బలగాల చేతిలో భారీగా నష్టపోయిన తన సంస్థకు మళ్లీ ఊపు తేవడానికే అజహర్ ఈ బెదిరింపులకు దిగి ఉంటాడని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం ప్రచారం కోసం చేస్తున్న ఓ ఉత్తుత్తి బెదిరింపుగానే వారు అభివర్ణిస్తున్నారు.

# సోమనాథుడికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు.. ఘనంగా 'శౌర్య యాత్ర'



- సోమనాథ్ ఆలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు, అభిషేకం
- 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ వేడుకల్లో భాగంగా పర్యటన
- శౌర్య యాత్రలో పాల్గొని డమరుకం వాయించిన ప్రధాని
- ఆలయ పునర్నిర్మాణానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు
- రాజ్‌కోట్, గాంధీనగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ

డెస్క్ జనవరి 11, (తొలి వెలుగు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లోని ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ వేడుకల్లో భాగంగా ఆయన ఆలయానికి విచ్చేసి, సోమనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రధాని స్వయంగా అభిషేకం, హారతి ఇచ్చి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు, పరిపాలన అధికారులతో ముచ్చటించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన 'శౌర్య యాత్ర'లో ప్రధాని పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఎందరో వీరుల గౌరవార్థం ఈ యాత్రను నిర్వహిస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన వీక్షించారు. యాత్ర సాగుతున్న దారి పొడవునా ప్రజలు బారులు తీరి 'మోదీ-మోదీ' నినాదాలతో, పూలు చల్లుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. శివుడికి ప్రతీకగా భావించే డమరుకం శబ్దాలు మిన్నంటగా, ప్రధాని మోదీ కూడా ఉత్సాహంగా డమరుకాన్ని చేతుల్లోకి తీసుకుని వాయించారు. ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమనాథ్ పర్యటన అనంతరం ప్రధాని రాజ్‌కోట్, గాంధీనగర్‌లలో పర్యటించనున్నారు. రాజ్‌కోట్‌లో ట్రేడ్ షో, వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సును ప్రారంభించనున్నారు. గాంధీనగర్‌లో అహ్మదాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్-2 మార్గాన్ని ఆయన ప్రారంభిస్తారు.

# తెలంగాణలో కాంగ్రెస్ కు బీజేపీ ప్రత్యామ్నాయం కాదు.. అసలు ఫైట్ మాతోనే - కేటీఆర్

- తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తి కాదన్న కేటీఆర్
- అసలు రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యేనని ఉద్ఘాటన
- కాంగ్రెస్ 24 నెలల పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు



డెస్క్, జనవరి 11, (తొలి వెలుగు) : తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అసలైన రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆదివారం నాడు ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ముఖ్య నేతలతో పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన గెలుపు కేవలం గాలివాటం మాత్రమేనని కొట్టిపారేశారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే అది సాధ్యమైందని, క్షేత్ర స్థాయిలో బీజేపీకి ఎలాంటి బలం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ సీనియర్ నేతలు ఘోరంగా ఓడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. గడిచిన 24 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల వంచనను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కృష్ణా నది జలాల వాటా, ఇతర అంతర్రాష్ట్ర సమస్యల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ కూడా మౌనంగా ఉంటూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ 24 నెలల అసమర్థ పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవలి ఉప ఎన్నికలు, పంచాయతీ పోల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీ రద్దీ...

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో పల్లెబాట పట్టిన పట్నం వాసులు
- శనివారం ఒక్క రోజే ఏపీకి 60 వేల వాహనాలు
- నిన్న ఆదివారం కావడంతో మరింత పెరిగిన రద్దీ



డెస్క్, జనవరి 11, (తొలి వెలుగు) : సంక్రాంతి పండుగకు పట్నం వాసులు పల్లెబాట పట్టారు. వరుస సెలవుల నేపథ్యంలో సొంతూర్లకు వెళుతున్నారు. దీంతో పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీ రద్దీ నెలకొంది. నిన్న ఒక్కరోజే సిటీ నుంచి ఏపీకి 60 వేల వాహనాలు వెళ్లాయని టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు. ఈ రోజు ఆదివారం కావడంతో మరింత ఎక్కువ రద్దీ నెలకొందని చెప్పారు. మరోవైపు రోడ్డు నిర్మాణ పనులతో ఏపీలోని నందిగామ వద్ద భారీ ట్రాఫిక్ జామ్ అయింది. సొంత వాహనాలలో జనం రోడ్డెక్కడంతో హైదరాబాద్- విజయవాడ రహదారిపై భారీ రద్దీ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. రద్దీ కారణంగా ఏపీ వైపు వెళ్లే వాహనాల కోసం ఎక్కువ టోల్‌బూత్‌లు తెరిచారు.

# రిపబ్లిక్ డే వేడుకల కోసం 1275 కిలోల చికెన్ ఆర్డర్..!

- ఢిల్లీలో ఘనంగా జరగనున్న వేడుకలు
- విమానాలను పక్షులు ఢీ కొట్టకుండా ఏర్పాట్లు
- ఎర్రకోట, జామా మసీద్ ప్రాంతాల్లో పక్షులకు ఆహారంగా చికెన్



డెస్క్, జనవరి 11, (తొలి వెలుగు) : రిపబ్లిక్ డే వేడుకలకు దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబవుతోంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఢిల్లీవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్ కోసం త్రివిధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నాయి. యుద్ధ విమానాలతో విన్యాసాల...


2


# హైదరాబాద్‌లో పశువైద్యుల అద్భుతం.. చేప చర్మంతో శునకానికి పునర్జన్మ

- హైదరాబాద్‌లో శునకానికి అరుదైన శస్త్రచికిత్స
- తీవ్ర ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న కుక్కకు చేప చర్మం అంటుకట్టు
- ప్రాణాపాయ స్థితి నుంచి మూగజీవాన్ని కాపాడిన వైద్యులు
- పశువైద్య రంగంలో ఇదొక విప్లవాత్మక మార్పన్న నిపుణులు





వివరాలు 2 లో..

# 2026 తొలి ప్రయోగానికి ఇస్రో సిద్ధం - కొనసాగుతున్న కౌంట్ డౌన్

- పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌తో 'అన్వేష' ఉపగ్రహం ప్రయోగం
- శ్రీహరికోట నుంచి సోమవారం ఉదయం 10:17 గంటలకు నింగిలోకి
- రక్షణ, విపత్తు నిర్వహణలో కీలకపాత్ర పోషించనున్న 'అన్వేష'
- 'అన్వేష'తో పాటు మరో 15 ఉపగ్రహాలను మోసుకెళ్లనున్న రాకెట్

డెస్క్, జనవరి 11 (తొలి వెలుగు) : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) రూపొందించిన 'అన్వేష' భూపరిశీలన ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జనవరి 12వ తేదీ ఉదయం 10:17 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. ఇందుకు సంబంధించిన 22.5 గంటల కౌంట్‌డౌన్ ఆదివారం మధ్యాహ్నం 12:17 గంటలకు మొదలైంది.

'అన్వేష' ఉపగ్రహం దేశ రక్షణ, వాతావరణ అధ్యయన రంగాల్లో అత్యంత కీలకం కానుంది. హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ టెక్నాలజీతో పనిచేసే ఈ ఉపగ్రహం భూమి ఉపరితలాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలించగలదు. దీని ద్వారా సరిహద్దుల వద్ద పర్యవేక్షణ, వ్యూహాత్మక నిఘా కార్యకలాపాలకు కీలక సమాచారం అందుతుంది. అంతేకాకుండా, వాతావరణ మార్పులను అధ్యయనం చేయడం, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే పసిగట్టి హెచ్చరికలు జారీ చేయడంలో ఇది సహాయపడనుంది.

ఈ మిషన్‌లో 'అన్వేష' ప్రధాన ఉపగ్రహం కాగా, దీనితో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కూడా ఒకేసారి నింగిలోకి పంపుతున్నారు. వీటిలో 7 దేశీయ, 8 విదేశీ ఉపగ్రహాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ 'టేక్‌మీ2స్పేస్ఞ రూపొందించిన ఉపగ్రహం కూడా వీటిలో ఉండటం విశేషం.

పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ మిషన్. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుండగా, ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో మరో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రయోగంపై దేశవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది.




# రిపబ్లిక్ డే వేడుకల కోసం 1275 కిలోల చికెన్ ఆర్డర్..!



మొదటిపేజీ తరువాయి..
కోసం వైమానిక దళం విస్తృత సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే 1275 కిలోల చికెన్ ను ఆర్డర్ పెట్టారని సమాచారం. రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా వైమానిక దళం ఆకాశంలో చేసే విన్యాసాలకు ఆటంకం కలగకుండా పక్షులకు ఆహారంగా ఇచ్చేందుకు చికెన్ ఆర్డర్ చేశారట. ఆకాశంలో ఎగిరే విమానాలను పక్షులు ఢీ కొంటే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీ-య సంఘటనలు జరగకుండా ఎర్రకోట, జామా మసీద్ వంటి 20 ప్రాంతాల్లో జనవరి 15 నుంచి 26 వరకు గద్దల కోసం మాంసం విసిరే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

# హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని అవుతారన్న ఒవైసీ - అదిరిపోయే కౌంటర్ ఇచ్చిన బండి సంజయ్

- హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని అవుతారన్న ఒవైసీ వ్యాఖ్యలపై బండి సంజయ్ తీవ్ర స్పందన
- ముందు మీ పార్టీకి బురఖా ధరించిన మహిళను అధ్యక్షురాలిని చేయాలని సవాల్
- ఎంఐఎం పార్టీ ఎంతమంది ముస్లిం మహిళలకు టికెట్లు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్న
- ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు బీజేపీ న్యాయం చేసిందని వెల్లడి
- సాధికారత అంటూనే ఒవైసీ మహిళలపై ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపణ



డెస్క్, జనవరి 11 (తొలి వెలుగు) : భవిష్యత్తులో హిజాబ్ ధరించిన మహిళ భారత ప్రధాని అవుతారంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని కావడం గురించి కలలు కనే ముందు, బురఖా ధరించిన మహిళను మీ పార్టీకి అధ్యక్షురాలిగా నియమించే ధైర్యం చూపాలని ఆయన ఒవైసీకి సవాల్ విసిరారు. ఆదివారం నాడు 'ఎక్స్ఞ వేదికగా బండి సంజయ్ ఈ మేరకు స్పందించారు. "ఎంఐఎం పార్టీ ఇప్పటివరకు ఎంతమంది ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్లు ఇచ్చింది? పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే పదవుల్లో ఎంతమంది మహిళలు ఉన్నారు?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం నినాదాలతో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినట్టు కాదని విమర్శించారు. 2018 ఎన్నికల్లో పాతబస్తీలో అక్బరుద్దీన్ ఒవైసీపై బీజేపీ తరఫున షాజాదీ సయ్యద్‌ను నిలబెట్టామని, అప్పుడు ఆమెను బెదిరించి ఓడించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆమె జాతీయ మైనారిటీ కమిషన్‌లో సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. సాధికారత గురించి మాట్లాడే ఒవైసీ, పార్టీలోనూ, ఇంట్లోనూ మహిళలపై ఆంక్షలు విధిస్తారని సంజయ్ విమర్శించారు. ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళల పేరిట సంక్షేమ పథకాలు, గ్యాస్ కనెక్షన్లు, గృహాలు వంటి సంస్క-రణలతో ముస్లిం మహిళలకు నిజమైన సాధికారతను అందించింది బీజేపీ ప్రభుత్వమేనని బండి సంజయ్ పేర్కొన్నారు. చాలామంది ముస్లిం మహిళలు ప్రధాని మోదీని తమ సోదరుడిగా భావిస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం అన్ని వర్గాల వారికి సమాన హోదా కల్పించిందని, అందుకే పాకిస్థాన్‌లా కాకుండా ఇక్కడ హిజాబ్ ధరించిన మహిళ కూడా ప్రధాని కాగలరని అసదు-ద్దీన్ ఒవైసీ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

# హైదరాబాద్‌లో పశువైద్యుల అద్భుతం.. చేప చర్మంతో శునకానికి పునర్జన్మ




మొదటిపేజీ తరువాయి...
డెస్క్, జనవరి 11, (తొలి వెలుగు) : పశువైద్య రంగంలో ఓ అద్భుతం చోటుచేసుకుంది. తీవ్రమైన ఇన్ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ శునకానికి, ప్రత్యేకంగా ప్రాసెస్ చేసిన చేప చర్మాన్ని అంటుకట్టి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న పెట్స్ కేర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపఅబశ్రీశ్రీ-త్రిలో ఈ అరుదైన శస్త్రచికిత్స విజయవంతమైంది.

వివరాల్లోకి వెళితే... బోడుప్పల్‌కు చెందిన ఓ వ్యక్తి తన పెంపుడు కుక్క తీవ్రమైన చర్మ వ్యాధితో బాధపడుతుండటంతో పెట్స్ కేర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు, శునకం శరీరంపై సుమారు 50 శాతం చర్మం ఇన్‌ఫెక్షన్ కారణంగా పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సాధారణ చికిత్సకు బదులుగా అధునాతన రీజెనరేటివ్ మెడిసిన్ పద్ధతి ద్వారా చికిత్స చేయాలని నిర్ణయించారు.

ఈ విధానంలో భాగంగా శునకానికి చేప చర్మాన్ని గ్రాఫ్టింగ్‌గా అమర్చారు. చేప చర్మంలో సహజంగా ఉండే కొల్లాజెన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు గాయం త్వరగా మానడానికి అద్భుతంగా సహకరిస్తాయని డాక్టర్ వెంకట్ వివరించారు. ఈ చర్మం ఒక సహజ కవచంలా పనిచేసి, ఇన్ఫెక్షన్లను అడ్డుకుంటుంది. అంతేకాకుండా ఇది నొప్పిని తగ్గించి, జంతువు శరీరం లోపల కొత్త చర్మం వేగంగా ఏర్పడటానికి సహాయపడుతుందని ఆయన తెలిపారు.

ఈ శస్త్రచికిత్స పశువైద్య రంగంలో ఒక విప్లవాత్మక మార్పు అని ప్రభుత్వ వెటర్నరీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ లక్ష్మణ్, డాక్టర్ షిరీన్ ప్రశంసించారు. సాధారణంగా మనుషుల్లో కాలిన గాయాలకు ఇలాంటి ప్రయోగాలు జరుగుతాయని, మూగజీవాలపై చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో క్లిష్టమైన చర్మ సమస్యలతో బాధపడే జంతువులకు ఈ చికిత్స తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు ఇస్తుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మంత్రి కోమటిరెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోంది : హరీశ్ రావు

డెస్క్, జనవరి 11, (తొలి వెలుగు) : తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే ఎవరి నియంత్రణలో ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన అన్నారు. ఒక శాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తికి తెలియకుండానే ఆ శాఖలో కీలక నిర్ణయాలు జరిగిపోవడం, జీవోలు విడుదల కావడం దారుణమని విమర్శించారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు జీవో బయటకు వస్తే, ఆ శాఖ మంత్రి అయిన కోమటిరెడ్డి 'నాకు తెలియదు, నా దగ్గరికి ఫైల్ రాలేదు' అని నిస్సహాయత వ్యక్తం చేయడం ప్రభుత్వంలో పాలన ఏ స్థాయిలో ఉందో చెబుతోందన్నారు. "శాఖ ఒకరిది, పెత్తనం మరొకరిది అన్నట్లుగా ఉంది. పలు శాఖలకు తానే మంత్రినని చెప్పుకొనే కోమటిరెడ్డి, ఇప్పుడు తన శాఖలో ఏం జరుగుతుందో తనకు సంబంధం లేదనడం విడ్డూరం. టికెట్ల రేట్ల పెంపు సీఎం నిర్ణయమేనని ఆయన చెప్పకనే చెబుతున్నారు. అంటే, సినిమా శాఖకు మంత్రి ఉన్నట్టా లేనట్టా?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. "రేవంత్ రెడ్డి గారు, మీరు నడుపుతోంది సర్కారా లేక సర్కస్ కంపెనీనా?" అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా తాను సీఎంగా ఉన్నంతకాలం టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని, మరో సినిమాకు కూడా సిద్ధమవుతున్నారని ఆరోపించారు. సభను, ప్రజలను ఇంత నిస్సిగ్గుగా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సినీ పరిశ్రమపై రాజకీయ కక్ష సాధిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. "పాలకుడు పాలసీతో ఉండాలి కానీ, పగతో ఉండకూడదు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్షగడతారు. మీ పేరు మరిచినందుకు మరో హీరోను జైలుకు పంపుతారు. ఇప్పుడు మీకు నచ్చిన వారికి రూ. 600 టికెట్ రేటుకు అనుమతి ఇస్తారా?" అని ప్రశ్నించారు. "గత పదేళ్లు కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎక్కడా వివక్ష చూపలేదు. అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగింది. ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయి. 50, 60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించుకున్న ఈ పరిశ్రమ వాతావరణాన్ని.. మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారు. ప్రభుత్వమంటే అందరినీ సమానంగా చూడాలి. ఒకరికి చుట్టం .. మరొకరికి శత్రుత్వం ఉండకూడదు. సినిమా వాళ్లను కూడా మీ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు. ఇది ప్రజా పాలన కాదు.. ఇది మీ పాపిష్టి పాలన కు పరాకాష్ఠ. మొన్న ఎన్నికల్లో ఓడిపోయి.. నేడు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్న ఆ కనిపించని శక్తి ఎవరో? ఒక్కో సినిమాకు కమీషన్ల రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేస్తున్నారో?.. ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపెడతాం" అని అన్నారు. సినిమా టికెట్ల రేట్ల కమీషన్ల దందాపై గవర్నర్ తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు.



# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



వలిగొండ, జనవరి 11 (తొలివెలుగు) : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎదుల్లగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు నోముల నర్సిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి మద్దతుగా పదవ తరగతి 2006ఉ07 బ్యాచ్‌కు చెందిన ఉజ్వల పాఠశాల విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం విద్యార్థుల తరఫున రూ. 51,000 నగదు రూపాయలను నోముల నర్సిరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కష్టకాలంలో తమ వంతు అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదా రంజిత్ గౌడ్, ఎల్లుండ కృష్ణారెడ్డి, దంతూరి అరుణ్ కుమార్, జిట్ట ప్రశాంత్ రెడ్డి, జోగు సురేష్, పగడాల ఉపేందర్, బోడపట్ల ప్రవీణ్ రెడ్డి, గోద రాజు, ఎడమ రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

- తుక్కాపురంలో బీఆర్ఎస్ విజేతలకు ఘన సన్మానం
- నూతన సర్పంచ్ శ్రీవాణి మహేష్, వార్డు సభ్యులకు శాలువాలతో సత్కారం
- కార్యక్రమానికి హాజరైన ఆత్మకూర్ మండల బీఆర్ఎస్ నాయకులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటిందని వెల్లడి
- పార్టీ శ్రేణులు, కార్యకర్తల ఐక్యతే విజయానికి కారణం అభివృద్ధి కొనసాగాలంటే కేసీఆర్ నాయకత్వమే అవసరం : చందర్ గౌడ్



ఆత్మకూర్(ఎం), జనవరి 11 (తొలివెలుగు) : ఆత్మకూర్ మండల పరిధిలోని తుక్కాపురం గ్రామంలో ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలుపొందిన నూతన సర్పంచ్ సంఘపాక శ్రీవాణి మహేష్‌తో పాటు వార్డు సభ్యులకు ఆదివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆత్మకూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు హాజరై నూతన పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు చందర్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణాభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలయ్యాయని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు మరింత అభివృద్ధి పథంలో నడవాలంటే మళ్లీ కేసీఆర్ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటడం ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు భాష బోయిన ఉప్పలయ్య, కోరే బిక్షపతి, తుక్కాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు యాట మధు, ఉపాధ్యక్షుడు సూడి మహేందర్ రెడ్డి, సామ బుచ్చిరెడ్డి, చిక్కిరి రవి, మల్లారెడ్డి, శీను, కల్వల నరేష్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం గడ్డపై ఎర్రజెండా గర్జన

- సీపీఐ 100 వసంతాల ముగింపు సభను విజయవంతం చేయండి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



చౌటుప్పల్, జనవరి 11 (తొలివెలుగు) : భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) వందేళ్ల సుదీర్ఘ పోరాట ప్రస్థానానికి ముగింపుగా ఈ నెల 18న ఖమ్మం నగరంలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఈ సభకు ఐదు లక్షల మందికి పైగా ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఆదివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ముగింపు సభ రాష్ట్ర స్థాయిని మించి అఖిల భారత స్థాయిలో ప్రాముఖ్యతను సంతరించుకుందని తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమానికి 40 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. సభను విజయవంతం చేసేందుకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలను నిర్వహించి విస్తృత ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. సీపీఐ చరిత్ర అంటేనే త్యాగాల చరిత్రని పేర్కొంటూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'స్వాతంత్ర్యం మా జన్మహక్కు' నినాదంతో అనేకమంది వీరులను దేశానికి అర్పించిన ఘనత ఈ పార్టీదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా పేదలు, అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచి, పెట్టుబడిదారీ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు సాగించిందన్నారు. ఎన్నో పోరాటాలు, రక్తతర్పణలతో భారత రాజకీయ చరిత్రలో ఎర్రజెండాకు ప్రత్యేక స్థానం ఏర్పడిందని పేర్కొన్న ఆయన, ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న సీపీఐ 100 వసంతాల ముగింపు ఉత్సవాలకు ప్రజలు, పార్టీ శ్రేయోభిలాషులు, కార్మిక వర్గాలు పెద్దఎత్తున సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు దుబ్బాక భాస్కర్, మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, టంగుటూరు రాములు, బద్దుల సుదాకర్, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు టీయుజేఏసీ కృతజ్ఞతలు



వలిగొండ, జనవరి 11 (తొలివెలుగు): శనివారం సూర్యాపేటలో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయుజేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభను ఘనంగా విజయవంతం చేసిన ఉద్యమకారులందరికీ టీయుజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ కృతజ్ఞతలు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో హాజరై సభ విజయానికి తోడ్పడిన ప్రతి ఉద్యమకారుడిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ ఉద్యమ ఆశయాలు, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ఉద్యమకారుల పాత్ర కీలకమని పేర్కొంటూ, వారి అంకితభావం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా నీలు నాయక్



చౌటుప్పల్, జనవరి 11 (తొలివెలుగు) : చౌటుప్పల్ మండలం ఎనగండి తండ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కరంటోతు నీలు నాయక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పానుగోతు సక్కు నాయక్, నాను నాయక్, మహేష్ నాయక్‌లను, ప్రధాన కార్యదర్శిగా పానుగోతు కిరణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా పానుగోతు గణేష్, కార్యదర్శిగా లచ్చు నాయక్‌లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నీలు నాయక్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చౌటుప్పల్, జనవరి 11 (తొలివెలుగు) : చౌటుప్పల్ జే.ఎస్.ఆర్ స్పోర్ట్స్ క్లబ్ (అంబిటస్ ది స్కూల్)కు చెందిన విద్యార్థులు జ్ఞానేష్, సిద్ధార్థ్, ధన్వీన్‌లు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె. ఉమాపతి తెలిపారు. జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం నిర్వహించిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఎంపిక పోటీల్లో అండర్-8, అండర్-10, అండర్-12 విభాగాల్లో బ్రాడ్ జంప్, 60 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్న తెలంగాణ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ఉ2026 పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ విజయంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ, మరింత ఉన్నత స్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

# పసుల రాధ సంవత్సరీకంలో పాల్గొని కుటుంబాన్ని పరామర్శించిన సోదా రామకృష్ణ



పరకాల, జనవరి 11 (తొలి వెలుగు) : పరకాల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుల శ్రీనివాస్ గారి తల్లి, దివంగత పసుల రాధ ప్రథమ సంవత్సరీకం (మాసికం) కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ సోదా రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత పసుల రాధ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పసుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్ట సమయంలో ధైర్యం కలిగి ఉండాలని భరోసా ఇచ్చారు. పార్టీ ఎప్పుడూ కార్యకర్తల కుటుంబాల వెంట ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒంటేరు కుమార్, మోరే సదానందం, పసుల బాబు, పసుల ప్రతాప్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మున్సిపాలిటీల్లో హస్తం క్లీన్‌స్వీప్ ఖాయం

## - తోటకూర వజ్రేష్ యాదవ్



మేడ్చల్ ఉమల్కాజిగిరి జిల్లా, జనవరి 11 (తొలి వెలుగు) : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలను పూర్తిగా కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ హస్తం జెండాను ఎగురవేస్తుందని మేడ్చల్ఉ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజా పాలననే తమ బలమని, సంక్షేమమే గెలుపు మంత్రమని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విగ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్లంపేట్ సోను ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డిలతో కలిసి వజ్రేష్ యాదవ్ మాట్లాడారు. ప్రజా పాలన ద్వారా ప్రజల విశ్వాసం సంపాదించుకున్న కాంగ్రెస్ పార్టీకే ఈ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీ విజయానికి బలమని స్పష్టం చేశారు. అలియాబాద్, ఎల్లంపేట్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల్లో ఉన్న మొత్తం 68 వార్డుల్లో మెజారిటీ స్థానాలు సాధించి, అన్ని చైర్మన్ పీఠాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా ఫోటోగ్రాఫర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ




చౌటుప్పల్, జనవరి 11 (తొలివెలుగు) : ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యమల అప్పల రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యమల అప్పల రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని గణేష్, జిల్లా అధ్యక్షుడు భోగచంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి రెడ్డి, కోశాధికారి తునికి దశరథ, ఉపాధ్యక్షులు ఎర్రోజు యజ్ఞమాచారి, చౌటుప్పల్ మండల అధ్యక్షులు తోర్పునూరి సాయిలు గౌడ్, ప్రధాన కార్యదర్శి సుక్క స్వామి, సహాయ కార్యదర్శి రోషణగారి రాఘవేంద్ర గౌడ్, గణేష్, మధు, భీమనపల్లి బలరాం, చలమందారెడ్డి, శివ, వెంకటేష్, శివ చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'విష'పు కౌగిలిలో అంతమ్మగూడెం.. కాలుష్యంపై ఎమ్మెల్సీకి రైతుల వినతి



పోచంపల్లి, జనవరి 11 (తొలివెలుగు) : పరిశ్రమల నుంచి వెలువడుతున్న ప్రమాదకర వ్యర్థాల వల్ల తమ ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం, అంతమ్మగూడెం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలిసి కాలుష్య తీవ్రతపై వినతిపత్రం అందజేశారు. హెజిలో, శ్రీజయ లాబొరేటరీస్ వంటి పరిశ్రమల నుంచి బెంజిన్, టోలిన్ వంటి క్యాన్సర్ కారక రసాయనాలు గాలిలో చేరుతున్నాయని ఆర్‌టీఐ నివేదికలను ఆయనకు సమర్పించారు. బోరు బావుల్లో టీడీఎస్ విలువ 50 వేలు, మట్టిలో సీటీడీ విలువ 16 వేలకు చేరిందన్న గణాంకాలను చూపి భయాందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను మండలిలో ప్రస్తావించినందుకు ఎమ్మెల్సీని సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు పగిళ్ల మోహన్ రెడ్డి, నాయకులు దుబ్బాక భాస్కర్, బద్దుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ అభివృద్ధి కోసం ఏకశిల పార్క్ వద్ద నిరసన దీక్ష

## - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంపూర్ణ మద్దతు




హనుమకొండ, జనవరి 11 (తొలి వెలుగు): వరంగల్ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ ఉద్యమకారుల వేదిక మరియు ఫోరం ఫర్ వరంగల్ ఆధ్వర్యంలో వివిధ పౌర సంఘాల సమన్వయంతో హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని ఏకశిల పార్క్ వద్ద నిర్వహించిన నిరసన దీక్షకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వరంగల్ జిల్లా హనుమకొండగా విడిపోయిన అనంతరం నగర అభివృద్ధి పారిశ్రామికంగా, పరిపాలనపరంగా నిలిచిపోయిందని, ఈ విభజన వల్ల వరంగల్ భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటోందని నగరానికి చెందిన విద్యావంతులు, మేధావులు, పౌర సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల 1300 సంవత్సరాల చరిత్ర కలిగిన వరంగల్ నగరం అపార నష్టాన్ని చవిచూసిందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, ప్రాంత భవిష్యత్తును పరిగణలోకి తీసుకోకుండా ఉమ్మడి జిల్లాను విభజించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. జిల్లాల విభజన అంశంపై తాను గతంలోనే అనేక వేదికలపై స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేశానని గుర్తు చేశారు. జిల్లా విభజన కారణంగా వరంగల్‌కు చెందిన చారిత్రక కట్టడాలు, వైభవోపేతమైన భవనాలు తమ గుర్తింపును కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ జైలును కూల్చివేసి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని, దవాఖాన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని తెలిపారు. నూతన భవనం వరంగల్ జిల్లాలో ఉండగా పార్కింగ్ హనుమకొండ జిల్లాలో ఉండడం ఈ గందరగోళానికి స్పష్టమైన ఉదాహరణ అని అన్నారు. తన నియోజకవర్గ పరిధిలోని 11, 29 డివిజన్లు వరంగల్ జిల్లాలో ఉండగా, మొత్తం నియోజకవర్గం హనుమకొండ జిల్లాలో ఉండటంతో ప్రజలు అనేక పరిపాలనా సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే, జిల్లాల పునర్నిర్మాణంపై ప్రభుత్వానికి సానుకూల దృక్పథం ఉందని తెలిపారు. వరంగల్ భవిష్యత్తు కోసం ఈ పోరాటంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, పౌరులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. వరంగల్ అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక, ఫోరం ఫర్ వరంగల్ ప్రతినిధులు, వివిధ పౌర సంఘాల నాయకులు, కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.